విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 336 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/-



## ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు

**4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్**

- విచారణ జరిగే కొద్దీ వెలుగు చూస్తున్న అక్రమాలు



హైదరాబాద్,

ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొన్ని పార్టీలు లేదా వ్యక్తులు ఎన్నికల పక్రియను ప్రభావితం చేస్తున్నారన్న నెపంతో, పలువురు కీలక రాజకీయ నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు వెల్లడవుతోంది. తాజాగా ఈ కేసులో 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుపై ఆరోపణలు వచ్చాయి. 2023 నవంబర్ 15 నుండి 30వ తేదీ మధ్యలోనే కనీసం 618 మంది నేతల -మిగతా 3 లో




## నా ఫోన్ ట్యాపింగ్ నిజం

- విచారణకు ఎక్కడికైనా వస్తా
- జగన్, కేసీఆర్ బంధంతో రక్త సంబంధం మరాష్
- మీడియాతో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

విశాఖపట్టణం,

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది పచ్చి నిజమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. తన ఫోన్‌తో పాటు భర్త, దగ్గర వాళ్ల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. విశాఖపట్నం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.'ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి నిర్ధరించారు. ఆనాడు ట్యాపింగ్ జరిగిన నా ఆడియో ఒకటి నాకే వినిపించారు. -మిగతా 3 లో



## మావోలకు మరో ఎదురుదెబ్బ

- రంపచోడవరం ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతి
- మృతుల్లో అరుణ,గాజర్ల రవి, అంజు ఉన్నట్లు గుర్తింపు

రంపచోడవరం

మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. మరో అగ్రనేత హతమయ్యాడు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. దేవీపట్నం మండలం కొండమొదలు అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు మృతిచెందారు. వీరిలో ఇటీవల మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతిరావు భార్య, స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు అరుణతో పాటు కేంద్ర కమిటీ సభ్యుడుయ గాజర్ల రవి -మిగతా 3 లో



## హైదరాబాద్ లో గూగుల్ సేఫ్టీ సెంటర్

జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

- డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని వెల్లడి
- డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే
- నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశాం
- తెలంగాణ రైజింగ్‌లో గూగుల్ తోడ్పాటు అవసరమన్న సీఎం



హైదరాబాద్,

ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే అని చెప్పారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. -మిగతా 3 లో



## ఇజ్రాయిల్ మూల్యం చెల్లించుకోక తప్పదు

- ట్రంప్ మితిమీరితే ఆయనకు ఇదే గతి
- విడియో సందేశంలో హెచ్చరించిన ఖొమేనీ

టెహ్రాన్

తమపై దాడి చేసి ఇజ్రాయెల్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దాడి చేయడం ద్వారా ఇజ్రాయిల్ భారీ తప్పిదం చేసిందని, అందుకు శిక్ష తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడుల వేళ వీడియో సందేశం విడుదల చేసిన ఆయన.. ఇరాన్ లొంగిపోదనే విషయాన్ని -మిగతా 3 లో



## రైతు భరోసా పై మాట్లాడే అర్హత లేదు

- బీఆర్ఎస్ నాయకులకు మంత్రి తుమ్మల కౌంటర్
- వరుసగా నాలుగోరోజు రైతు ఖాతాల్లో నగదు జమ

హైదరాబాద్

రైతుభరోసా విషయంలో భారాస నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో భారాస ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయింది. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. కానీ తాము ప్రకటించిన మేరకు నిధులు విడుదల చేస్తున్నామని -మిగతా 3 లో

## బనకచర్లతో తెలంగాణకు పెద్ద దెబ్బ

### బనకచర్లపై కేంద్రానికి ఫిర్యాదు



- నేడు ఢిల్లీలో కేంద్రమంత్రిని కలవనున్న సిఎం
- పోలవరం-బనకచర్లతో తెలంగాణకు అన్యాయం
- ఎంపిల కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఉత్తమ్

హైదరాబాద్

బనకచర్ల విషయంలో ఏపీ దూకుడుకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం సిద్దమయ్యింది. ఈ మేరకు గురువారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌ని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల నేతృత్వంలోని బృందం కలవనుంది. బుధవారం సాయంత్రం గోదావరి-బనకచర్లపై ఎంపీలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశానికి సిఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపిలు, బిజెపి ఎంపిలు డికె అరుణ, రఘునందన్ రావు, బిఆర్ఎస్ -మిగతా 3 లో




## రూ.3 వేలతో ఏడాదంతా ప్రయాణం..

కొత్త ఫాస్టాగ్ పాలసీని తీసుకొచ్చిన కేంద్ర

న్యూఢిల్లీ,

వాహనదారులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఫాస్టాగ్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైవేలపై ప్రయాణాన్ని సులభతరం చేయడానికి కొత్త ఫాస్టాగ్ పాలసీని తీసుకొచ్చింది. అన్ని రహదారులపై ప్రతిసారీ టోల్‌ట్యాక్స్ చెల్లించాల్సిన పనిలేకుండా ఒకేసారి -మిగతా 3 లో

## ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు




- జీ7 సదస్సులో ప్రధాని మోడీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ,

ఉగ్రవాదం ఎక్కడున్నా, ఏ రూపంలో ఉన్నా అది మానవాళికి ప్రధాన శత్రువని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కెనడాలో జరిగిన జీ7 సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని బహిరంగంగా సమర్థించే దేశాలు తగిన మూల్యం చెల్లించుకుంటాయని హెచ్చరించారు. ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి -మిగతా 3 లో

# డీఎన్ఏ పరీక్ష ద్వారా 184 మృతదేహాలు గుర్తింపు



**అహ్మదాబాద్**
అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇవాళ ఉదయం 8 గంటల వరకూ డీఎన్ఏ పరీక్షల ద్వారా 184 మంది వివరాలు గుర్తించినట్లు గుజరాత్ హెూం మంత్రి హర్ష్ సంఘవి బుధవారం ఉదయం ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఉదయం 8 గంటల సమయం వరకూ 184 డీఎన్ఏలు సరిపోలాయి' అని పేర్కొన్నారు. గుర్తించిన మృతదేహాలను అధికారులు కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. మరోవైపు మృతదేహాలను గుర్తించడానికి అహ్మదాబాద్‌లో డీఎన్ఏ ప్రయోగశాల 24 గంటలూ పనిచేస్తోంది. గతవారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో దాదాపు 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు విమాన ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


## తమ డివైజ్‌ల నుంచి వాట్సాప్‌ను తొలగించాలని ప్రజలకు ఇరాన్ సూచన..

### మెటాపై సంచలన ఆరోపణలు




**ఇరాన్,**
ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం రోజురోజుకూ ముదురుతున్నది. వరుసగా ఆరో రోజు కూడా ప్రతిదాడులతో ఇరు దేశాలూ విరుచుకుపడుతున్నాయి. ఇక ఇరాన్ సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, అణువుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దళాలు భీకర దాడులు కొనసాగిస్తున్నాయి. రాజధాని టెహ్రాన్ సహా పలు కీలక ప్రాంతాలు, నగరాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ భారీ నష్టాన్ని చవిచూస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ తన ప్రజలకు కీలక సూచన చేసింది. దేశ ప్రజలు తక్షణమే తమ స్మార్ట్‌ఫోన్ల నుంచి ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ను తొలగించాలని సూచించింది. ఈ సందర్భంగా మెటాపై సంచలన ఆరోపణలు చేసింది. ప్రజల సమాచారాన్ని వాట్సాప్ సేకరించి ఇజ్రాయెల్‌కు చేరవేస్తోందని ఆరోపించింది. ఈ మేరకు ప్రభుత్వ మీడియా సంస్థ ద్వారా ఇరాన్ ప్రకటన విడుదల చేసింది. అయితే, ఇరాన్ ఆరోపణలపై మెటా తీవ్రంగా స్పందించింది. తమ సేవలు ప్రజలకు అందకుండా బ్లాక్ చేయడానికి ఇలాంటి తప్పుడు నివేదికలు సాకుగా ఉపయోగపడతాయని ఆందోళన వ్యక్తం చేసింది. లొకేషన్లను, ఎవరి వ్యక్తిగత మెసేజ్‌లను ట్రాక్ చేయమని తెలిపింది. అంతేకాదు తాము ఏ ప్రభుత్వంతోనూ సమాచారాన్ని పంచుకోమని స్పష్టం చేసింది.

## 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి.. ఆపై చెట్టుకు ఉరేసి..!



**ఒడిశా**
బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, ఆపై ఆమెను చెట్టుకు ఉరేసి చంపిన ఘటన ఒడిశా రాష్ట్రం కియోంఝర్ జిల్లాలోని గోపాల్‌పూర్ ఏరియాలో ఆదివారం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గోపాల్‌పూర్ ఏరియాలోపి టెంట్‌లపాషి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. దాంతో అంతా వెతికిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు గ్రామ శివార్లలోని పొలాల్లో చెట్టుకు వేలాడుతూ బాలిక మృతదేహం కనిపించింది. ఘటనా ప్రాంతాల్లో లభించిన మొబైల్ ఫోన్, దుస్తుల ఆధారంగా ముగ్గురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు నిందితులు బాలికకు తెలిసినవారేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. బాలిక పోస్టుమార్టం నివేదిక వస్తే కేసు దర్యాప్తు సులువయ్యే అవకాశం ఉందని అన్నారు.

# అమెరికాకు ఇరాన్ సుప్రీం లీడర్ వార్నింగ్

### యూఎస్ సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం..

**న్యూఢిల్లీ**
ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణ తీవ్రరూపం దాలుస్తున్న దృష్ట్యా ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ బేషరతుగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించిన విషయం తెలిసిందే. ట్రంప్ వ్యాఖ్యలపై ఖమేనీ తాజాగా స్పందించారు. లొంగిపోయే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు అమెరికా సైనిక జోక్యం వల్ల కోలుకోలేని నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఈ మేరకు ఖమేనీ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 'ఇరాన్ దేశ చరిత్ర తెలిసిన తెలివైన వ్యక్తులు ఈ దేశంతో ఎప్పుడూ బెదిరింపు ధోరణితో మాట్లాడరు. ఎందుకంటే ఇరాన్ దేశం ఎన్నటికీ లొంగిపోదు. అమెరికా సైనిక జోక్యం చేసుకుంటే.. నిస్సందేహంగా కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయాన్ని అమెరికన్లు తెలుసుకోవాలి' అని సుప్రీం లీడర్ హెచ్చరించారు.



**ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తెలుసు..**
ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసునని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం వెల్లడించారు. అయితే ఖమేనీ చావును ప్రస్తుతానికి తాము కోరుకోవడం లేదని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణ తీవ్రరూపం దాలుస్తున్న దృష్ట్యా బేషరతుగా లొంగిపోవాలని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కేవలం కాల్పుల విరమణను మాత్రమే తాను కోరుకోవడం లేదని, అంతకన్నా మెరుగైన పరిష్కారాన్నే తాను కోరుకుంటున్నానని ట్రంప్ ప్రకటించారు. జీ7 సదస్సును అర్ధాంతరంగా ముగించుకుని సోమవారం రాత్రి కెనడా నుంచి వాషింగ్టన్‌కు తిరిగివస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం



**హైదరాబాద్**
ఇండోనేషియాలో అగ్నిపర్వతం బద్దలవ్వడంతో పలు విమాన సర్వీసులకు ఆటంకం కలిగింది. బాలికి వెళ్లే పలు విమానాలు వెనక్కిమళ్లాయి. ఎయిరిండియా విమానం ఏఐ 2145 కూడా మధ్యలో నుంచే తిరుగుపయనమై ఢిల్లీకి వచ్చింది. ప్రయాణికులందరినీ సురక్షితంగా దింపినట్లు ఎయిరిండియా ప్రకటించింది. దక్షిణ మధ్య ఇండోనేషియాలోని మౌంట్ లెవోటోబి లకి లకి అగ్నిపర్వతం మంగళవారం బద్దలై, వేడి బూడిదను గాలిలోకి ఎగరేసింది. బిలం నుండి 8 కిలోమీటర్ల (సుమారు 5 మైళ్ళు) వరకు లావా విస్తరించింది. ఇండోనేషియా జియాలజీ ఏజెన్సీ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించింది. మంగళవారం మధ్యాహ్నం అగ్నిపర్వతం 10 వేల మీటర్లు (సుమారు 32,800 అడుగులు) మందపాటి బూడిద మేఘాలను విడుదల చేసినట్లు నమోదయిందని తెలిపింది. ఆ బూడిద పుట్టగొడుగు ఆకారంలో ఉన్న బూడిద మేఘంగా ఆవరించింది. పర్వతం నుండి 90 కిలోమీటర్లు (సుమారు 56 మైళ్ళు) నుండి 150 కిలోమీటర్లు (దాదాపు 93 మైళ్ళు) దూరంలో ఉన్న నగరాల వరకు ఈ దట్టమైన బూడిద కమ్ముకుంది. అయితే ఈ విస్ఫోటనంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని నివేదించింది. భారీ వర్షపాతం కారణంగా అగ్నిపర్వతం నుండి ఉద్భవించే లావా నదులలో ప్రవహించే అవకాశం ఉండటంతో నివాసితులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## దేశంలో 6,483కి పడిపోయిన యాక్టివ్ కేసులు..

### 113కి పెరిగిన మరణాలు



**న్యూఢిల్లీ**
దేశంలో కరోనా వైరస్ కేసులు తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా 300కిపైనే నమోదవుతున్న కేసులు ఇప్పుడు 200లోపే వెలుగు చూస్తున్నాయి. దీంతో క్రియాశీల కేసులు కూడా భారీగా తగ్గాయి. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. గత 24 గంటల్లో 163 మందికి పాజిటివ్‌గా తేలింది. అత్యధికంగా ఢిల్లీలో నిన్న ఒక్కరోజే 65 కేసులు బయటపడ్డాయి. ఆ తర్వాత రాజస్థాన్‌లో 51 కేసులు వెలుగు చూశాయి. ప్రస్తుతం దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 6,483కి పడిపోయింది. అత్యధికంగా కేరళలో 1384 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 1105, పశ్చిమ బెంగాల్‌లో 747, కర్ణాటకలో 653, ఢిల్లీలో 620 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. నిన్న ఒక్కరోజే కరోనా కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలో ఇద్దరు, ఢిల్లీ, కేరళలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 113కి పెరిగింది.

## డబ్బులిచ్చి ఆమెతో ఎవరైనా శృంగారం చేయొచ్చు'..

### – శాడిస్ట్ భర్తకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరణ




**న్యూఢిల్లీ**
భార్యను సరిగా చూసుకోకపోవడమేగాక పలు విధాలుగా చిత్రహింసలు పెట్టి, ఇతరులతో శృంగారానికి బలవంతం చేసిన భర్తకు బెయిలు ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. నిందితుడిపై అత్యాచారం, సామూహిక అత్యాచార యత్నం, లైంగిక వేధింపులు, క్రూరమైన ప్రవర్తన, విశ్వాసాన్ని భంగపరచడం లాంటి అభియోగాలు నమోదై ఉన్నందున అతడికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు ససేమిరా అంది. ఇది సాధారణ వైవాహిక వేధింపుల కేసు కాదని నిందితుడి బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ గిరీశ్ కథపాలియా వ్యాఖ్యానించారు. కేసు వివరాల ప్రకారం.. మరిది లైంగికంగా వేధిస్తున్నాడని చెప్పినా భర్త నిర్లక్ష్యం చేసేవాడని, మాట వినకపోతే బ్లేడుతో నా చేతులను గాయపర్చి అలాగే వంట చేయించేవాడని, హెూటల్‌కు తీసుకువెళ్లి స్నేహితులతో శృంగారంలో పాల్గొనమని బలవంతం చేస్తే తప్పించుకొని వచ్చానని బాధితురాలు ఫిర్యాదు చేసింది. నిందితుడు తన భార్య ఫొటోలతో నకిలీ ఇన్‌స్టా ఐడీ సృష్టించి.. 'డబ్బులిచ్చి ఎవరైనా శృంగారంలో పాల్గొనవచ్చు' అంటూ ఆన్‌లైన్ ఆఫర్ ప్రకటించినట్లు బాధితురాలు కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొంది. ఈ వాంగ్మూలాన్ని పరిగణనలోకి తీసుకొన్న హైకోర్టు నిందితుడికి బెయిలు మంజూరుకు నిరాకరించింది. అతడి బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

## ఇకపై 15 రోజుల్లోనే ఓటర్ ఐడి కార్డులు




**న్యూఢిల్లీ**
ఓటర్లకు ఐడి కార్డులు త్వరితగతిన అందించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఎన్నికల రిజిస్ట్రర్‌లో దరఖాస్తుకు సంబంధించిన మార్పులు జరిగిన 15 రోజుల్లోపే ఓటర్ ఐడీ కార్డులు (ఇపిఐసి) ఓటర్లకు చేరేలా ఈ కొత్త విధానం తీసుకొచ్చినట్లు పేర్కొంది. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్న వారితో సహా, ఇప్పటికే ఉన్న ఓటరు వివరాల్లో మార్పులు చేసిన వారికి కూడా 15 రోజుల్లోనే కార్డును డెలివరీ చేస్తామని వెల్లడించింది.

**రియల్ టైమ్ ట్రాకింగ్**
ప్రస్తుతం ఓటర్లకు ఓటర్ ఐడి కార్డులు అందడానికి ఒక నెలకు పైగా సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయబోతున్నారు. ఈ కొత్త విధానంలో, ఓటర్ కార్డు తయారవడం నుంచి ఓటరుకు అందే వరకు ప్రతి దశలో పర్యవేక్షించడం కోసం రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకొచ్చినట్టు ఇసి వివరించింది. ఈ ప్రక్రియను ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. అంతేకాక, ప్రతి దశలో ఓటర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా ఓటర్లు తమ ఓటర్ ఐడీ కార్డు స్థితిని తెలుసుకోవడానికి వీలవుతుంది.

# హైదరాబాద్ లో గూగుల్ సేఫ్టీ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు. 'గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం. నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశాం. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోందని ఈ సందర్భంగా అన్నారు.. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ మారాలన్న లక్షయంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నాం అన్నారు. ఇక్కడి మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారు. ప్రభుత్వంలో నూతన ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చాం'అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రపంచంలో ఐదవది మాత్రమే అని తెలిపారు. గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయిందని.. నేడు మన జీవితాలు పూర్తిగా డిజిటల్‌గా మారాయన్నారు. గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నామని తెలిపారు. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్‌గా మారాయి. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతామని చెప్పుకొచ్చారు. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగి స్తున్నందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. ఇది నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెడుతుందన్నారు. ఉపాధిని సృష్టించడంతో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతమని.. ఈ విధానాన్ని తాను ఇష్టపడుతున్నట్లు తెలిపారు. గూగుల్‌లా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నానన్నారు. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయని.. అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టిపెట్టి పనిచేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడికి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుందన్నారు. సెర్చ్‌లో మొదటి లింక్ హైదరాబాద్ వస్తుందని సీఎం రేవంత్ అన్నారు. దీనిని తెలంగాణ రైజింగ్ అని పిలుస్తామని... 2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. 1 కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. గూగుల్ ఆఫీస్ పక్కన రెండున్నర ఎకరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశామని.. రైతులను సంపన్నులుగా తయారు చేయడంతో పాటు సంతోషంగా ఉంచాలను కుంటున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి కల్పించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. అందుకు గూగుల్ మద్దతు కావాలని.. తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా కావాలని కోరుకుంటున్నామన్నారు. గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులన్నారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దాదాపు 7,000 మంది గూగుల్ ఉద్యోగులు నేడు హైదరాబాద్‌ను తమ ఇల్లుగా భావిస్తున్నా రన్నారు. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం ఇలా అనేక రంగాలలో గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. గూగుల్ ఒక వినూత్న సంస్థ, తమది ఒక వినూత్న ప్రభుత్వమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించినట్లు చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వాలు ట్రాన్సజెండర్స్‌ని నిర్లక్ష్యం చేశాయన్నారు. జీహెచ్ఎంసీ కూడా వివిధ పనుల కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించుకుంటోందన్నారు. నాణ్యమైన విద్య తమ లక్ష్యమని.. ఇందుకోసం యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకువస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రతీ సంవత్సరం 1.10 లక్షల ఇంజనీర్స్ కాలేజ్‌ల నుంచి వస్తున్నారని... చాలా మంది విద్యార్థులకు నైపుణ్యం ఉండడం లేదన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందరికీ ఆరోగ్యం తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇవే తన ప్రధాన ఆవిష్కరణలన్నారు. 'గూగుల్ లాగానే, నా ప్రభుత్వంలో భాగస్వాములైన మహిళలు, యువత, రైతులు, పేదలు, మధ్యతరగతి, సీనియర్ సిటిజన్లు, పిల్లలకు ఉన్నతమైన జీవన ప్రమాణాలు కల్పించాలని కోరుకుంటున్నాను. మనం కలిసి గొప్ప ప్రమాణాలను సృష్టిద్దాం. హైదరాబాద్‌లో మీ కొత్త సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు మరోసారి అభినందిస్తున్నాను. మేం గర్వపడేలా మీరు పనిచేస్తారని విశ్వసిస్తున్నాను' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత గూగుల్ మొదలుపెట్టిన రెండో సెంటర్ ఇది. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఇది ఐదవది కావడం గమనార్హం. గతేడాది ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి, హైదరాబాద్‌లో ఈ సెంటర్ ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రతా వ్యవస్థలు, ఆన్‌లైన్ సేఫ్టీ టూల్స్‌ను అభివృద్ధి చేయడంలో ఇది కీలకంగా పనిచేయనుంది. ప్రపంచ నిపుణులు, పరిశోధకులు ఇందులో భాగమవుతారు. ఈ కేంద్రం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర యువతకు లభించే అవకాశముంది. ఐటీ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకుపోతుందన్నది ఈ అభివృద్ధి సంకేతం.

# ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్లను ట్యాప్ చేశారట. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి, కోటింరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి వంటి నాయకుల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం ట్యాప్ చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ సహా అనేక పార్టీల కీలక నేతలు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ లక్ష్యంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. నిన్న ఒక్కరోజే తొమ్మిది మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. అందులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య, గాంధీ భవన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు ఉన్నారు. ఇవన్నీ మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన ఆధారాలతో వెలుగులోకి వచ్చాయి. ఈ రోజు పీసీసీ అధికార ప్రతినిధి జయపాల్ రెడ్డి సిట్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదే విధంగా ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును కూడా విచారించారు.

# నా ఫోన్ ట్యాపింగ్ నిజం

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికి రమ్మన్నా వస్తా. తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ వేగవంతం చేయాలి. ఆనాడు జగన్, కేసీఆర్ మధ్య ఉన్న సంబంధం చూసి రక్త సంబంధం కూడా చిన్నబోయింది. ఫోన్ ట్యాపింగ్.. తెలంగాణలో నన్ను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకు ఆ ఇద్దరు కలిసి వేసిన స్కెచ్. ÷ళిసీఆర్ కోసం జగన్ నన్ను తొక్కి పెట్టాలని చూశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలిస్తే మీరు ఏం చేశారు అని నన్ను అడగొచ్చు. ఆనాడు ఉన్న పరిస్థితులు వేరు. అప్పుడు జగన్, కేసీఆర్ చేసినవి అరాచకాలు. వీరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చిన్నది. నేను జగన్‌కు తోడబుట్టిన చెలెల్ని. ఆ విషయం మరిచి నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదు అని కుట్ర చేశారు. నా భవిష్యత్తును పాతిపెట్టాలని ఎన్నో చేశారు. నాకు మద్దతు పలికిన వాళ్లను బెదిరించారు. రాజకీయంగా నా వాళ్లు రానివ్వకుండా చేశారు. నేను తెలంగాణలో పార్టీ పెట్టడంలో జగన్‌కు ఏ సంబంధం లేదు. కేసీఆర్ కోసం నన్ను తొక్కి పెట్టాలని చూశారు. నా చుట్టూ పరిస్థితులను కష్టతరం చేశారు. నా ప్రతి పోరాటానికి అడ్డుపడ్డారు.' అని షర్మిల అన్నారు.

# మావోలకు మరో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

అలియాస్ ఉదయ్, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ ఏసీఎం అంజు ఉన్నట్లు గుర్తించారు. ఘటనాస్థలంలో మూడు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 2018లో డుంబ్రిగుడ సమీపంలో జరిగిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో అరుణ నిందితురాలిగా ఉన్నారు. ఆమె స్వస్థలం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. ఉదయ్‌పై రూ.25లక్షలు, అరుణపై రూ.20లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకురానున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతానికి మారేడుమిల్లి సీఐ, దేవీపట్నం ఎస్సై, పోలీసు సిబ్బంది బయల్దేరారు.


# రైతు భరోసా పై మాట్లాడే అర్హత లేదు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నాం. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్ సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వదిలేస్తే.. మేం అధికారంలోకి రాగానే ఆ నిధులు కూడా చెల్లించాం. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తుమ్మల అన్నారు. రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ కొనసాగుతోంది. మూడో రోజు బుధవారం 4 ఎకరాల విస్తీర్ణం వరకు రైతుభరోసా నిధులు జమ కోసం ప్రభుత్వం మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. మరో 21.89 లక్షల ఎకరాలకు సంబంధించి 6.33 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.5215.26 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసి 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించినట్లైంది. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతుభరోసా నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు వానాకాలం రైతుభరోసా నిధులు జమ చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా 9 రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికైనా భారాస నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి. లేదంటే రైతాంగం ఎప్పటికీ క్షమించదు'అని మంత్రి తుమ్మల అన్నారు.

# బనకచర్లతో తెలంగాణకు పెద్ద దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)



ఎంపి రవిచంద్ర, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. పోలవరం-బనకచర్ల విషయంలో ఎపి విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తోందని అన్నారు. ఎపి రిపోర్టుపై స్పందించాలని కేంద్రం తమని అడిగిందని తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ఉత్తమ్ పేర్కొన్నారు. తను, సిఎం ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర అభ్యంతరాలను తెలుపుతామని స్పష్టం చేశారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులకు పెద్ద దెబ్బ అని తెలిపారు. ఈ ప్రాజెక్టును పరిశీలించడం అంటే రాష్ట్ర హక్కులను కాలరాయడమే అని అన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును తిరస్కరించాలని కేంద్రానికి స్పష్టంగా చెప్పామని వెల్లడించారు. గోదావరి ట్రైబ్యునల్ అవార్డును బనకచర్ల ప్రాజెక్టు ఉల్లంఘిస్తుందని.. తెలంగాణకు అనుకూలమైన ఇచ్చంపల్లిని ఎపి వ్యతిరేకించిదని మండిపడ్డారు. అత్యవసరంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరామన్నారు. తెలంగాణ వాటా 968 టిఎంసిలలో కట్టుకొనే ప్రాజెక్టులను ఎపి వ్యతిరేకించిందని.. బనకచర్ల వల్ల మన వాటా జలాలకు కూడ భవిష్యత్తులో ఎదురుదెబ్బ తగులుతుందని అన్నారు. పూర్తయిన ప్రాజెక్టులకు అధిక కేటాయింపులను భవిష్యత్తులో ఎపి అడుగుతుందని పేర్కొన్నారు. దీనిపై కేంద్రానికి జనవరి 22న అభ్యంతరాలను చెప్పామన్నారు. అయితే ఎపి నుంచి డిపిఆర్ అందలేదని కేంద్రం సమాధానం ఇచ్చిందని తెలిపారు.


# ఇజ్రాయిల్ మూల్యం చెల్లించుకోక తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకోవాలన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఉద్దేశిస్తూ.. అటువంటి బెదిరింపులకు భయపడమనే విషయం ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందన్నారు. అంతేకాదు అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయం అమెరికన్లు తెలుసుకోవాలన్నారు. ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న పోరులో అమెరికా జోక్యం చేసుకుంటే అది పశ్చిమాసియాలో విస్తృత యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి కూడా హెచ్చరించారు. ఘర్షణల నేపథ్యంలో తొలిసారి స్పందించిన ఆయన.. తమపై దాడులకు దీటుగా స్పందిస్తామన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని.. ఆయన సురక్షితంగా ఉన్నారని చెప్పారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను చంపాలనుకోవడం లేదన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేదంటే పరిస్థితులు తీవ్రంగా మారుతాయని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఖమేనీ ఈ విధంగా స్పందించారు.

# ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

(మొదటి పేజీ తరువాయి)



మానవత్వంపై జరిగిన దాడిగా మోదీ అభివర్ణించారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదన్నారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టే అన్ని దేశాలు దీన్ని వ్యతిరేకించాలి. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం మన ఆలోచనలు, విధానాలు స్పష్టంగా ఉండాలి. ఏదైనా దేశం ఉగ్రవాదానికి మద్దతిస్తే అందుకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మోదీ పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు అనిశ్చితి, సంఘర్షణలతో ఎక్కువగా బాధపడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక సంక్షోభాలతో ముందుగా దెబ్బతినేది వారేనన్నారు. గ్లోబల్ సౌత్‌లో నెలకొన్న ఆందోళనలు, ప్రాధాన్యతలను ప్రపంచ వేదికపై లేవనెత్తడాన్ని భారత్ తన బాధ్యతగా భావిస్తోందన్నారు. ఇక, ప్రధాని డీప్‌ఫేక్ గురించి కూడా మాట్లాడారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్న మోదీ.. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌పై వాటర్ మార్కింగ్ లేదా స్పష్టమైన గుర్తు ఉండాలన్నారు. ఈ శతాబ్దంలో సాంకేతికతపై పరస్పర సహకారం అవసరమన్నారు. కృత్రిమ మేధస్సు చుట్టూ ఉన్న ఆందోళనలను పరిష్కరించి, ఆవిష్కరణలు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన నేపథ్యంలో మోదీ కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో సహా పలువురు ప్రపంచ నాయకులను కలిశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

# రూ.3 వేలతో ఏడాదంతా ప్రయాణం..

(మొదటి పేజీ తరువాయి)


ఏడాదికి చెల్లించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను (FASTag Annual Pass) తీసుకొచ్చింది. ఈ పాస్ ద్వారా వాహనదారులు రూ.3వేలు చెల్లించి ఏడాదంతా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణించొచ్చు. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఎక్స్‌లో పంచుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ వార్షిక పాస్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. యాక్టివేట్ చేసిన పాస్‌లు ఏడాదిపాటు లేదా 200 ట్రిప్పులు (ఏది ముందైతే అది) చెల్లుబాటు అవుతాయని వెల్లడించారు. కార్లు, వ్యాన్లు వంటి నాన్ కమర్షియల్ వాహనాలకు మాత్రమే ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ పాస్ యాక్టివేషన్ కోసం త్వరలోనే లింక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు నితిన్ గడ్కరీ వెల్లడించారు. రాజ్‌మార్గ్ యాప్‌తోపాటు వెబ్‌సైట్లలో ఈ లింగ్ అందుబాటులోకి వస్తుందన్నారు.

# సంపాదకీయం

## ఆపరేషన్ కగార్‌దే పైచేయి !

ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగి అగ్రనేతలు ముగ్గురు నేలకొరిగారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. మొత్తంగా అగ్రనేతలు అంతా హతమవుతున్నారు. కేంద్రం ఏదైతే కోరుకుంటుందో అదే జరుగుతోంది. నిజానికి పీపుల్స్ వార్ రాకతోనే గ్రామాల్లో పెత్తందారీ వ్యవస్థ అంతరించింది. దొరల సామ్రాజ్యానికి చెక్ పడింది. గడీల పాలన అంతమొందింది. ఊర్లో భూస్వాముల అఘాయిత్యాలు ఆగాయి. రాజకీయ నేతల దూకుడు తగ్గింది. ఏదైనా పనిచేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. కానీ ఇప్పుడు రాజకీయ నాయకుల పెత్తనం పెరిగింది. భయమన్నది లేకుండా పోయింది. అఇకారంలోకి వచ్చి భూములను కబ్జా చేస్తున్నారు. అప్పనంగా అమ్ముకుంటున్నారు. తప్పుడు పనులు చేసే రాజకీయ నాయకులకు, బూకబ్జాదారులకు పీపుల్స్ వార్ హయాలో భయం ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే దళాలను చుట్టుముట్టి మట్టుబెడుతున్న కారణంగా మావోలు అంతరించి పోతున్నారు. ముఖ్యంగా మావోలను అంతమొందించాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఈ సమయంలో ఇక చర్చలకు తావు లేదన్న విధంగా కేంద్రం మొండిగా ఉంది. మావోలపైనే ఎందుకనో దూకుడుగా వ్యవహరిస్తోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కానీ, మణిపూర్‌లో అల్లర్లు అణచివేయడంలో కానీ ఇంత దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరి స్తోందని మహాధర్నాలు పలువురు నేతలు విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని పలువురు విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న వారు గళమెత్తారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని కూడా అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్య నైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని ,నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే..ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోలతో చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమన మేనని శాశ్వత పరిష్కారం కాదని గుర్తు చేశారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ,అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా ..నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని కూడా విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే అని విమర్శించారు. మొత్తంగా ఇప్పుడు కేంద్రం అనుకున్న విధంగా మావోలు అంతమొందించే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. అయితే దోపిడీ ఉన్నంతకాలం పోరాటం ఉంటుంది. రాజకీయ దోపిడీ ఉంటే తిరుగుబాటు తప్పదని చరిత్ర రుజువు చేసింది. రాజకీయ దోపిడీని అరికట్టాలి. జబ్బుకు చికిత్స చేయడం కన్నా అసలు జబ్బులే రాకుండా నిరోధించ గలగడం ముఖ్యమని వైద్యశాస్త్రంలో చెబుతారు. అందుకోసం కృషి చేయడం మంచిది. సమాజంలో ఉత్పన్నమయ్యే అశాంతికి, ఇతర సమస్యలకు పరిష్కారం చూపకుండా కేవలం మావోలను అణచివేస్తే సమస్య సమిసి పోదని గుర్తించాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ప్రజలు అసంతృప్తితో చేసే ఆందోళనలపై ప్రభుత్వం తమ బలాన్ని, బలగాలను ప్రయోగించడం వల్ల లాభం లేదు. ఉద్యమాలను, ఆందోళనలను ప్రతిష్ఠగా తీసుకొని ఎంత గొప్పగా వాటిని అణచివేశామో చెప్పుకోవడం సరికాదు. మార్చి 31 వరకు సంపూర్ణంగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ప్రస్తుతం ఎక్కడైతే కేంద్రీకరించి పని చేస్తుందో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి వారిని మట్టుపెడుతున్న తీరుతో వారు అంతమొందడం ఖాయం కానీ...ప్రజల్లో గూడుకట్టుకున్న ఆందోళనలను మాత్రం అణచివేయడం సాధ్యం కాదని గుర్తించాలి.

# శుభాన్ష శుక్లా అంతరిక్ష యాత్ర వాయిదా



**న్యూఢిల్లీ**

శుభాన్షు శుక్లా రోదసి యాత్ర మరోసారి వాయిదా పడింది. ఇటీవలే ఈ మిషన్‌ను జూన్ 19న చేపట్టనున్నట్లు గతవారం ఇస్రో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, అది ఇప్పుడు ఈనెల 22కు వాయిదా పడింది. ఈ విషయాన్ని అమెరికా ప్రైవేట్ స్పేస్ సంస్థ 'యాక్సియమ్' ఓ ప్రకటనలో తెలిపింది. ఇటీవలే చేపట్టిన మరమ్మతులు, వాతావరణ పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకని జూన్ 22ను తదుపరి ప్రయోగ తేదీగా ఫిక్స్ చేసినట్లు యాక్సియం వెల్లడించింది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగం ద్వారా భారత్, పోలండ్, హంగేరీకి చెందిన నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపుతున్నారు. ఈ మిషన్‌కు భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా పైలట్‌గా వ్యవహరించబోతున్నారు. అమెరికా ప్రైవేట్ స్పేస్ సంస్థ 'యాక్సియమ్' చేపడుతున్న మానవ సహిత అంతరిక్ష ప్రయోగం 'ఏఎక్స్-4' మిషన్ లో భాగంగా స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా వీరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. దీంతో ప్రైవేట్ రోదసి యాత్ర ద్వారా ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారత వ్యోమగామిగా శుభాన్షు చరిత్రకెక్కనున్నారు. ఇప్పటికే భారత్‌కు చెందిన ప్రముఖ వ్యోమగామి రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. రష్యా సహకారంతో అంతరిక్షయానం చేశారు. రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేసిన నాలుగు దశాబ్దాల (1984) తర్వాత శుభాన్షు ఈ గౌరవాన్ని దక్కించుకోనున్నారు. నాసా సహకారంతో శుక్లా ఐఎస్ఎస్‌లో వివిధ శాస్త్రీయ పరిశోధనలు చేయనున్నారు. పైలట్‌గా ఈ యాత్రలో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని శుక్లా ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, సాంకేతిక కారణాలతో యాక్సియం-4 ప్రయోగం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. నిజానికి మే 29నే ఈ ప్రయోగం జరగాల్సి ఉండగా వాయిదా పడింది. తొలుత ఈ ప్రయోగాన్ని జూన్ 8వ తేదీకి వాయిదా వేశారు. ఆ తర్వాత జూన్ 10, జూన్ 11కు వాయిదా పడింది. యాక్సియం-4 మిషన్‌కు సంబంధించిన ఫాల్కన్-9 రాకెట్ తనిఖీల్లో ద్రవరూప ఆక్సిజన్ లీకేజ్ కారణంగా జూన్ 11న జరగాల్సిన ఈ ప్రయోగం మళ్లీ వాయిదా వేశారు. లీకేజ్‌కు సంబంధించిన మరమ్మత్తులు పూర్తిచేసేందుకు మరింత సమయం పడుతుందని, రాకెట్ లాంచింగ్‌ను వాయిదా వేస్తున్నట్టు స్పేస్‌ఎక్స్ తెలిపింది. ఆ తర్వాత ప్రయోగాన్ని జూన్ 19 చేపట్టున్నట్లు ఇస్రో ప్రకటించినప్పటికీ అది ఇప్పుడు మళ్లీ వాయిదా పడింది.

# కొనసాగుతున్న రైతు భరోసా

- మూడో రోజు రూ.1,313 కోట్లు విడుదల
- నాలుగు ఎకరాలున్న రైతుల ఖాతాల్లో జమ
- మంత్రి తుమ్మల వెల్లడి



**-హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం వానాకాలానికి ఇస్తున్న రైతు భరోసా పథకం కొనసాగుతున్నది. మూడో రోజు నాలుగు ఎకరాలున్న రైతులకు రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. ఈమేరకు బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ చేసినట్టు తెలిపారు. దీంతో 21.89 లక్షల ఎకరాలున్న 6.33 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం రైతు భరోసా నిధులు రూ.5215.26 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. తద్వారా 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించామని పేర్కొన్నారు. రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీమేరకు వరుసగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్టు తెలిపారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకూ ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసా విషయంలో బీఆర్ఎస్ నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా తొమ్మిది రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. లేదంటే రైతాంగం ఎప్పటికీ బీఆర్ఎస్ నేతలను క్షమించబోదని హెచ్చరించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయిందని గుర్తు చేశారు. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లోకి జమ చేసిందని తెలిపారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నిధులను కూడా చెల్లించిందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణయేనని మంత్రి స్పష్టం చేశారు.

## తెరుచుకోని డోర్.. 40 నిమిషాల పాటూ విమానంలోనే ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం




**న్యూఢిల్లీ**

విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఢిల్లీ నుంచి రాయ్‌పూర్ వచ్చిన ఇండిగో విమానం సమస్య తలెత్తింది. విమానం ల్యాండ్ అయినా డోర్ మాత్రం తెరుచుకోలేదు. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో విమానంలో ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం, పలువురు ప్రముఖులు ఉన్నట్లు తెలిసింది. ఇండిగో సంస్థకు చెందిన 6E-6312 విమానం ఢిల్లీ నుంచి రాయ్‌పూర్ చేరుకుంది. రాయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యింది. అయితే, ల్యాండింగ్ అనంతరం సాంకేతిక సమస్య తలెత్తింది. విమానం తలుపు తెరుచుకోకుండా మొరాయించింది. దీంతో దాదాపు 40 నిమిషాల పాటు ప్రయాణికులు, సిబ్బంది అందులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో విమానంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ , ఛత్తీస్‌గఢ్ ఎమ్మెల్యే చతురి నాద్, మేయర్ మీనాల్ చౌబే ఉన్నారు. ఈ ఘటనతో విమానంలో గందరగోళ పరిస్థితి తలెత్తింది. ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## పాకిస్థాన్‌లో రైల్వే ట్రాక్‌పై బాంబు పేలుడు..

### మరోసారి ప్రమాదానికి గురైన జాఫర్




**పాకిస్థాన్**

పాకిస్థాన్ లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ మరోసారి ప్రమాదానికి గురైంది. సింధ్ ప్రావిన్స్ లోని జకోబాబాద్ వద్ద రైల్వే ట్రాక్‌పై బాంబు పేలుడు సంభవించింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. రైలు మార్గంలో ఐఈడీ బాంబు అమర్చడం వల్లే పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. అయితే,ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని స్థానిక మీడియా తెలిపిందికాగా, జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి జరగడం ఈ ఏడాది ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను పాక్‌లోని వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు హైజాక్ చేశారు. అందులోని వందలాది మందిని బందీలుగా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారిని రక్షించేందుకు వెళ్లిన పాక్ సైనికులను హతమార్చారు. అనంతరం పాక్ ఆర్మీ ఆపరేషన్ చేపట్టి బందీలను విడిచిపెట్టింది. అయితే, 214 మంది పాక్ సైనికులను హతమార్చినట్లు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ అప్పట్లో ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఊరికో బస్సు..ఇంటికో దీపం..

**- నినాదంతో మా ప్రభుత్వం ముందుకు పోతోంది**
**-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలకు ఆర్థిక శాఖ రూ.6,210 కోట్లు చెల్లింపు**
**-ఆర్టీసీని లాభాల బాట పట్టించాం : మధిర బస్టాండ్ శంకుస్థాపన సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

ప్రజా స్వేచ్ఛ -మధిర

"ఊరికో బస్సు, ఇంటికో దీపం.." నినాదంతో ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కాలం నుంచి ఇప్పటి ప్రజాప్రభుత్వ పాలన వరకు రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలో రూ.10 కోట్లతో నిర్మించనున్న కొత్త బస్టాండ్ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం 10 కొత్త బస్సులను ప్రారంభించారు. ముందుగా బోనకల్ మండలం జానకీపురం సబ్ స్టేషన్‌లో ఆర్‌టీఎఫ్ఎంఎస్, ఎఫ్‌పీఐ వ్యవస్థలను ప్రారంభించారు. అనంతరం మధిరలో ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడారు. ఊరికో బస్సు నినాదంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, ఇంటికో దీపం పేరుతో ప్రతి ఇంట్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఈ పదేండ్లు అధకారంలో ఉన్న బీఆర్ఎస్ ఆర్టీసీని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. నిజంగా ప్రజల పట్ల నిబద్ధత, ఆలోచన ఉన్నవారే ప్రజలకు మేలు జరిగే సౌకర్యాలు కల్పిస్తారని, అందుకే రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన టీజీఎస్ఆర్టీసీ నిలదొక్కుకొని లాభాల బాట పట్టించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ నిత్యం కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలను గౌరవించుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళలకు 186 కోట్ల జీరో టికెట్లు జారీ చేయగా రూ.6,250 కోట్లు ఆర్థిక శాఖ ఆర్టీసీకి చెల్లించాల్సి ఉండగా ఇందులో ఇప్పటికే రూ.6,210 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. బ్యాటరీతో నడిచే 600 బస్సులను మహిళా సంఘాలకు ఇచ్చామని తెలిపారు. ఆర్టీసీ సంస్థ భవనాలపై సోలార్ ఉత్పత్తికి ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బస్సులు, బస్టాండ్ల ఆధునికీకరణ జరుగుతోందని తెలిపారు. మధిర బస్టాండ్ పరిసరాల్లో నీళ్లు నిలబడుతున్నాయని చెప్పగానే రవాణా శాఖ మంత్రి నివేదిక తెప్పించుకొని ఆర్టీసీ బోర్డులో ప్రవేశపెట్టిరూ.10 కోట్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు మధిరలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు జరుగుతు న్నాయని, ఆర్టీసీ డిపో డ్రయినేజీని వాటికి అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్తు సరఫరా జరుగుతుందని అన్నారు. ఒకవేళ విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెనువెంటనే గుర్తించి మరమ్మతులు చేసేందుకు రియల్ టైం ఫీడర్ మేనేజ్‌మెంట్ సిస్టం (టీఆర్ఎఫ్ఎంఎస్), ఫాల్ట్ పాస్ ఏజ్ ఇండికేటర్స్ (ఎఫ్‌పీఐ) ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. ఆధునిక పరి జ్ఞానాన్ని ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్.. సంస్థల పరిధిలోని డాష్ బోర్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ సమస్య ఏర్పడినా గుర్తించే అవకాశం ఈ ఆధునిక వ్యవస్థల ద్వారా వీలవుతుందని తెలిపారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ దొంగ దీక్షలు దొంగ నిరసనలు

**కోట్లలో అభివృద్ధి పనులు జరుతుంటే నిద్రపోతున్నారా**
**మండల అధ్యక్షులు పీరినాకి నవీన్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ప్రజా స్వేచ్ఛ ...

. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్చుకోలేక తట్టుకోలేక ఉనికి కాపాడుకోవడం కోసం ధర్నా నిరసన కార్యక్రమం చేయడం సిగ్గుచేటు మణుగూరు మున్సిపాలిటీలలో మరియు గ్రామ పంచాయతీలలో మునుపెన్నడూ లేని విధంగా కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి వాటర్ ట్యాంకులు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్స్, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు పట్టణం వరద ముంపుకు గురి కాకూడదని ప్రధాన ఉద్దేశంతో కట్టువాగు, మొట్ల వాగు, కోడిపుంజుల వాగు ల పై ప్రణాళికలను రూపొందించి కోట్ల రూపాయలను వెచ్చించి పూడిక తీత పనులను ప్రారంభించి పర్యవేక్షిస్తున్నటువంటి ప్రజా నాయకుడు అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గత మీ పాలనలో మణుగూరు మండలాన్ని అంధకారంలోకి నెట్టి దోచుకోవడం దాచుకోవడం సెటిల్మెంట్లు తప్ప అభివృద్ధిపై శ్రద్ధ పెట్టని మీరు ఈరోజు ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ అధికారులతో పలుమార్లు రివ్యూలు ఏర్పాటు చేసి అభివృద్ధికి సంబంధించిన పనులను కాంట్రాక్టర్లను ప్రోత్సహించి పనులు జరిగే విధంగా ఆదేశాలు జారీ చేస్తూ మండల అభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్న ప్రజా నాయకుడు మరియు ప్రజా ప్రభుత్వం పైన కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం పైన నిందలు వేస్తూ దొంగ నిరసనలకు పునుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదు ప్రజలు అంత గమనిస్తూనే వున్నారు తాగిన బుద్ధిచెపుతారు అని మండల కాంగ్రెస్ అధ్యక్షులు తెలియజేసారు.

## మాతృ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, మెటీరియల్ పంపిణీ.

**ముఖ్య అతిధిగా పాల్గొని పంపిణీ చేసిన ఎస్ ఐ రాజ్ కుమార్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , ప్రజా స్వేచ్ఛ ...

తోగ్గూడెం ప్రాధమిక పాఠశాల విధ్యార్థులకు మాతృ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు, జామెట్రీ మెటీరియల్ ను ఉచితంగా అందించారు. బుధవారం తోగ్గూడెం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ఏడూళ్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై 40 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ రాజ్ కుమార్ మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు ఉన్నతమైన విద్యను అందుకునేందుకు ఎన్నో ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ ఉంటారని , వారి కోసం మాతృ అభయ ఫౌండేషన్ నిర్వాహకులు ముందుకొచ్చి పాఠశాలల ప్రారంభ దశలోనే ఇలా నోట్ బుక్స్, ఇతర సామాగ్రి ని అందించడం అభినందనీయమని ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్ అన్నారు. అలాగే మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమం లో మాతృ అభయ ఫౌండేషన్ నిర్వాహకులు రామటెంకి రమేష్, ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్చార్జి చిట్టిమల్ల సతీష్ చారి, సురేష్, పూనెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని ప్రతి రోడ్డు 5.5 మీటర్ల వెడల్పు ఉండాల్సిందే

**-రోడ్ల నిర్మాణంలో నాణ్యత పై రాజీ పడేది లేదు**
**-రోడ్ల నిర్మాణ పనితీరు పై అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షలో.... కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు**



మర్రిగూడ ,ప్రజా స్వేచ్ఛ...

మునుగోడు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ ల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనుల పురోగతిపై మునుగోడు లోని అధికారిక క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సాగర్ రోడ్డు నుండి ముష్టిపల్లి వరకు, ముష్టిపల్లి నుండి నాంపల్లి వరకు జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.. వీటితోపాటు అంగడిపేట నుండి లెంకలపల్లి వరకు చేపట్టబోయే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రొసీజర్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు... నాంపల్లి నుండి ఇడికుడ వరకు, ఇడికుడ నుండి కమ్మగూడెం(తెరట్ పల్లి) వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్లుగా మార్చిన తర్వాత వాటి పనులకు సంబంధించి పురోగతి పై ఆరా తీశారు... వీటితోపాటు నియోజకవర్గంలో హేచ్ ఏ ఎమ్ కింద ఎన్ని రోడ్లకు ప్రపోజల్స్ పంపించారనే విషయాలపై చర్చించారు... పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పిఆర్ రోడ్ల పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు... ప్రస్తుతం జరుగుతున్న 57 రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయి ఎప్పటి వరకు పూర్తవుతాయని ఆరా తీశారు... ఇవే కాకుండా మరో 34 పి ఆర్ రోడ్లు టెండరింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు... ప్రస్తుతం జరుగుతున్న 89 రోడ్డు పనుల ప్రోగ్రెస్ పై ఫోకస్ పెట్టి ప్రతిరోడ్డు 5.5 మీటర్లు వెడల్పు తో నాణ్యతతో నిర్మించాలన్నారు... నియోజకవర్గం లోని ప్రతి పిఆర్ రోడ్డు 3.75 మీటర్ల నుండి 5.5 మీటర్ల వెడల్పుకి మార్చాలని అధికారులను ఆదేశించారు... నియోజకవర్గంలో ఏ రోడ్డును చూసినా కూడా 5.5 మీటర్ల వెడల్పుతో ఉండాలని సూచించారు.. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని రోడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు..మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం కోసం, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించే బాధ్యత నాదని, నాణ్యత రోడ్ల నిర్మాణం చేయాల్సిన బాధ్యత మీపై ఉందని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమం లో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా వచ్చిన జిల్లా కలెక్టర్ ను కలిసిన పోలీస్ కమిషనర్ బి. అనురాధ ఐపిఎస్...



సిద్దిపేట,ప్రజా స్వేచ్ఛ...

సిద్దిపేట జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన కే. హైమావతి, ఐఏఎస్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు జిల్లాలోని శాంతిభద్రతలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భూ భారతి సదస్సులు, తదితర అంశాల గురించి చర్చించుకున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పేదలకు ఆసరా.

**మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్.**



మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ ...

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు నిరుపేదలకు ఆసరాగా నిలుస్తున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్ అన్నారు. బుధవారం నేదునూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ కు 40 వేలు, నిర్మలకు 60 వేల రూపాయలు సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను బుధవారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేఎల్ఆర్ ఆదేశాల తో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మాజీ వైస్ ఎంఫ్ అండ్ చెక్కులను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శివగల్ల యాదయ్య, యుగేందర్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, కందుకూరు మండల యూత్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపిటిసి పాండు నాయక్, నాయకులు నరసింహ, యూత్ అధ్యక్షుడు శివశంకర్, శివకృష్ణ, రాణా ప్రతాపరెడ్డి, ఢిల్లీ శ్రీధర్, బాబు, రాకేష్ గౌడ్, దర్శన్, సురేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్,ఎంపీటీసీ,జెడ్పీటీసి,వార్డ్ మెంబర్ - ఎన్నికలకు ఇద్దరు పిల్లల నిబంధననూ ఎత్తివేయాలి

**స్థానిక సంస్థ ఎన్నికలలో యువత పెద్ద ఎత్తున - పోటీ చేయడానికి ముందుకు రావాలి**

**సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ ఏర్పాట చేసిన కొమ్ముల ప్రవీణ్ రాజ్ తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా కన్వీనర్**




హైదరాబాద్ ,ప్రజా స్వేచ్ఛ ... సోమాజిగూడ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో కొమ్ముల ప్రవీణ్ రాజ్ మాట్లాడుతూ.... త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నటువంటి ఇద్దరు పిల్లల నిబంధనను తక్షణమే 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి, రద్దు చేయాలని కొమ్ముల ప్రవీణ్ రాజ్ డిమాండ్ చేయడం జరిగింది. ఇద్దరు పిల్లల నిబంధన వలన గ్రామాలలో నాయకత్వం లక్షణాలు ఉన్న వ్యక్తులు వెనక పడుతూ అదే విధంగా వాళ్ళ హక్కులను కూడా అరించేటట్టుగా ఉన్నటువంటి ఈ ఇద్దరు పిల్లలు నిబంధనలను తక్షణమే రద్దు చేసిన తర్వాతే స్థానిక సంస్థ ఎన్నికలకు వెళ్లాలని ప్రవీణ్ కోరారు. అదేవిధంగా స్థానిక సంస్థలలో పెద్ద ఎత్తున యువత ముందుకు వచ్చి పోటీలో ఉండాలని పిలుపునివ్వడం జరిగింది.బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించిన తర్వాత స్థానిక సంస్థ ఎన్నికలనూ జరపాలి.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మాట ఇచ్చి ఇప్పుడు ఆ రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థలు ఎన్నికలు పోవడం దుర్మార్గం, బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించకుండగా స్థానిక సంస్థలు ఎన్నికలు పోవడం,అంటేనే బీసీలను నయవంచనకు మరియు మోసం చేయడమేనని కొమ్ముల ప్రవీణ్ రాజ్ ఫైర్ అయ్యారు.ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేసిన తర్వాతే స్థానిక సంస్థలు ఎన్నికలు జరపాలి.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి.

## తెలంగాణ రాష్ట్రం అంబేద్కర్ యువజన సంఘం




పీఏ పల్లి ,ప్రజా స్వేచ్ఛ .... పీఏ పల్లి మండల అధ్యక్షులుగా దున్న ముత్యాలు ఎన్నిక తెలంగాణ రాష్ట్రం అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్ర ఆంజనేయులు పిఏ పల్లి మండలం వద్దిపట్ల గ్రామానికి చెందిన దున్న ముత్యాలు గారిని పిఏ పల్లి మండల అధ్యక్షులుగా నియమాక పత్రం అందించారు ఈ సందర్భంగా దున్న ముత్యాలు మాట్లాడుతూ పీఏ పల్లి మండలంలో అంబేద్కర్ యువజన సంఘాన్ని బలోపేతానికి కృషి చేస్తానని సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తానని ప్రభుత్వపరంగా వచ్చే సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందే విధంగా నా వంతుగా కృషి చేస్తానని తెలిపారు

## విద్యార్థులకు నోట్స్ బుక్స్ ప్లేట్ వాటర్ బాటిల్ అందజేసిన టీచర్ నాగరాణి



టేక్మాల్ ,ప్రజా స్వేచ్ఛ మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలోని హరిజన వాడలో స్థానిక టీచర్ నాగరాణి ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్స్,ప్లేట్స్, వాటర్ బాటిల్స్, అందచేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో H M రాజేంద్రప్రసాద్, శివరాజ్ సర్,మాజీ ఎంపీపీ స్వప్న,ఆదర్శ యువజన సంఘం అధ్యక్షులు ఎర్రోళ్ల శేషు ,బొబ్బిలి సుధాకర్, గణేష్ తదిదరులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది...

## బిఎస్పీ గద్వాల్ మండల అధ్యక్షులుగా గుర్రం గడ్డ శివ ను నియమించిన - బహుజన సమాజ్ పార్టీ గద్వాల్ నియోజకవర్గం అధ్యక్షులు బండారి ఎస్.రాజు



జోగులాంబ గద్వాల్ జిల్లా , ప్రజా స్వేచ్ఛ .... బీఎస్పీ నియోజకవర్గం అధ్యక్షులు బండారి ఎస్.రాజు మాట్లాడుతూ... బహుజనులకు రాజ్యాధికారం కోసం కొట్లాడే పార్టీ ఏదయినా ఉంది అంటే అది కేవలం బహుజన సమాజ్ పార్టీ మాత్రమే అని అన్నారు.ఎస్సీ,ఎస్టీ,బీసీలు, మైనార్టీలు,అగ్రకుల ఆధిపత్య పార్టీల జెండాలు మోయడం బంద్ చేసి, బహుజన సమాజ్ పార్టీలో చేరి మహనీయుల ఆశయాల కోసం పోరాటం చేద్దాం రండి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో బిఎస్పీ దరూర్ మండలం ప్రధాన కార్యదర్శి దేవన్న, వరుణ్ పాల్గొన్నారు.

## పెద్ద ధన్వాడ ఇత్తనాలు ఫ్యాక్టరీ సందర్శనకు వెళ్తున్న రాష్ట్ర పౌర హక్కుల సంఘం నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామికం.







జోగులాంబ గద్వాల,జిల్లా ప్రజా స్వేచ్ఛ... ఐజ మండల కేంద్రంలో ప్రజాసంఘాల నాయకులు సమావేశమై పెద్ద ధన్వాడ ఇత్తనాలు ఫ్యాక్టరీ సందర్శనకు వెళ్తున్న రాష్ట్ర పౌర హక్కుల నేతల అరెస్టును ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....మారుమూల ప్రాంతమైన పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మిస్తున్న ఇత్తనాలు ఫ్యాక్టరీని వెంటనే రద్దు చేయాలని కోరుతూ చాలాకాలంగా ప్రజలు కోరుతున్న విషయము తెలిసిందే ఈనెల నాలుగో తేదీన ఫ్యాక్టరీ యజమానుల గుండాయిజానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే ఆ సందర్భంగా జరిగిన ఆందోళనలో ఫ్యాక్టరీ యజమానుల కంటైనర్ ఇతర వాహనాలు ధ్వంసం అయ్యాయి ప్రజలు గత సంవత్సర కాలంగా వ్యతిరేకిస్తున్న అన్ని పార్టీలు మద్దతు పలుకుతూ ఫ్యాక్టరీని కట్టనీయబోమని రద్దు చేస్తామని హామీలు ఇచ్చి హామీలను మరిచి మళ్ళీ ఫ్యాక్టరీని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసి ప్రజలు ఆందోళన గురై వ్యతిరేకించారు.ఈ సందర్భంగా ఈ ఆందోళనల నేపథ్యంలో 40 మంది అమాయక రైతులపై కేసులు బనాయించారు 12 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు.12 గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్న సందర్భంగా వారిని పరామర్శించడానికి వెళ్తున్న రాజకీయ పార్టీలను ప్రజాసంఘాలను పరామర్శించకుండగా అడ్డుకుంటున్నారు,అదే రకంగా బుధవారం రాష్ట్ర పౌర హక్కుల సంఘము నేతలు బాధిత గ్రామాలకు వెళ్లి ప్రజలకు ధైర్యం చెప్పడానికి నిజనిర్ధారణకు వెళ్తున్న సందర్భంగా అరెస్టుకు గురయ్యారు ఎర్రబల్లి చౌరస్తాలో అరెస్టు చేసి ఇటిక్యాల పోలీస్ స్టేషన్ లోఉంచడం జరిగింది.దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజాసంఘాల నాయకులు వివిధ రాజకీయ పార్టీలు ఖండించాయి. అరెస్టు అయిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ప్రొఫెసర్ నారాయణరావు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సుభాన్ జిల్లా అధ్యక్షులు జెక్క బాలయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఇతరులు ఉన్నారు వీరిని వెంటనే విడుదల చేయవలసిందిగా కోరుతూ పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో పౌర హక్కుల జిల్లా నేత విజయభాస్కర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగరదొడ్డి వెంకట రాములు,టిడిపి నాయకులు సుధాకర్ గౌడ్, ప్రజాసంఘాల నాయకులు కృష్ణన్న పౌర హక్కుల నాయకులు ఆంజనేయులు, ఎల్కూరు మహేష్,రైతు సంఘం నాయకులు కర్రెప్ప,దేవదానం, భీమన్న టిడిపి తదితరులు ఉన్నారు.

## సొంత ఊరు,సొంత బడి ఏదో చేయాలనే తపన .. వెంకటకృష్ణ

**-బడి పిల్లలకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు బహుకరణ.**

**-ఊరుకి, ఊరిలో ఉన్న ప్రజలకు ఎంతోకొంత సహాయపడాలనే ఆశ.**

**-ఎన్నో కార్యక్రమాలతో ప్రజల ఆదరాభిమానాలు పొందారు.**

**-సంపసాల అశోక్ మెమోరియల్ నిర్వాహకులు వెంకటకృష్ణ.**




కల్లూరు ,ప్రజా స్వేచ్ఛ... స్థానిక ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు సంపసాల అశోక్ మెమోరియల్ నిర్వాహకులు విద్యార్థులకు అవసరాలను గుర్తించి నోట్ బుక్స్, పలకలు, పెన్నులు వగైరా వారి మెరుగైన భవిష్యత్తు కోసం ఎంతోకొంత సహాయపడాలనే ఉద్దేశంతో ఈరోజు సంపసాల వెంకటకృష్ణ సొంత గ్రామమైన చెన్నూరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు కె.వి.ఆర్ చేత బహుకరించారు.రాజకీయంగా గురువులైన కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శిష్యులుగా ఉండి ఊరి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ అనునిత్యం ప్రజలతో మమేకమవుతూ సేవలను అందిస్తున్నారు. చెన్నూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకుగాను చేతి పంపును నిర్మించి స్థానిక ప్రజలకు అందించారు. అలాగే చంపసాల అశోక్ మెమోరియల్ ఆధ్వర్యంలో తల సేమియా వ్యాధితో రక్తహీనత ఉన్న పిల్లలకు బ్లడ్ డొనేషన్ క్యాంప్స్ నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఉచితంగా రక్తాన్ని అందించి ఎందరో ప్రాణాలను కాపాడినవారు అయ్యారు. ఇలా వారి చేతనైనంతలో ఏదో ఒక కార్యక్రమంతో ప్రజలలో మమేకమవుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఒక మంచి నాయకుడిగా ఒక మంచి ప్రజా సేవకుడిగా ప్రజల ఆదరాభిమానాలు పొందుతూ ఉన్నారు సంపసాల అశోక్ మెమోరియల్ నిర్వాహకులు సంపసాల వెంకటకృష్ణ. ఎంతోకొంత ప్రజలకు ఉపయోగపడాలని తపన తాపత్రయం రాజకీయ గురువు అయిన మట్టా దయానంద్ నీ చూసి అలవర్చుకున్నట్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## నియమ నిబంధనలు పాటించని,అనుమతులు లేని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవాలి

**ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**




ప్రజా స్వేచ్ఛ ,గోదావరిఖని న్యూస్ మండల విద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు. ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం . రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనుమతులు లేని, నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కొన్ని ప్రైవేట్,కార్పోరేట్ పాఠశాలలకు అనుమతులు లేకున్నా,రంగు రంగుల కరపత్రాలతో, హంగు ఆర్భాటాలతో, ఆకర్షించే విధంగా,లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ ,మా పాఠశాలలో చేరితే ఫీజులో రాయితీ కల్పిస్తామని, మాయ మాటలు చెప్పి,చేరిన తర్వాత మొత్తం ఫీజు కట్టాలంటూ విద్యార్థులను ,వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తూ,మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలలకు ప్రభుత్వం నుండి అనుమతులు ఉన్నాయా! లేవా! అని తెలుసుకొని చేర్పించాలని ఆయన అన్నారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా నడుపుతున్న, ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, రామగుండం మండలం అధ్యక్షులు మాతంగి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రికత్తలు కొనసాగుతున్నాయి. యుద్ధ భయాలు నెలకొన్నాయి. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపై ప్రభావం పడింది. అదే సమయంలో మెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయం బుధవారం రాత్రి వెలువడనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 81,314.62 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత సూచీలు లాభాల్లోకి దూసుకెళ్లాయి. కొద్దిసేపటికే మళ్లీ ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఇంట్రాడేలో 81,858.97 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,237.01 పాయింట్లకు చేరింది.చివరకు 138 పాయింట్ల నష్టంతో 81,444.66 వద్ద ముగిసింది. నిఫ్టీ 41 పాయింట్లు పతనమై 24,812.05 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1486 షేర్లు లాభపడగా.. 2,342 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో టీసీఎస్, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌యూఎల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, టైటాన్ కంపెనీ, మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా లాభాలను ఆర్జించాయి. రంగాల వారీగా, ఆటో, ప్రైవేట్ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా, అన్ని ఇతర సూచీలు ఐటీ, మీడియా, మెటల్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ 0.5-1 శాతం పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.3 శాతం పడిపోయాయి.

## దిగొచ్చిన పుత్తడి.. తులంపై రూ.1,200 తగ్గుదల..

### లక్ష రూపాయలకు ధర



న్యూఢిల్లీ, జూన్ 17
బంగారం ధరలు దిగొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు భారీగా తగ్గాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.1,200 దిగొచ్చి రూ.1,00, 170గా నమోదైంది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర లక్ష రూపాయల దిగువకు పడిపోయింది. పదిగ్రాముల ధర రూ.1,100 తగ్గి రూ.99,450కి చేరుకున్నది. ఇజ్రాయిల్-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు అప్రమత్తతకు మొగ్గుచూపారని, దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆభరణాలకు డిమాండ్ గణనీయంగా పడిపోయిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. కానీ, వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. కిలో వెండి రూ.100 అందుకొని రూ.1,07,200కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,380.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, వెండి 36.47 డాలర్ల వద్ద ఉన్నది. అమెరికా ఫెడరల్ రిజర్వు తన పరపతి సమీక్ష సమావేశం కంటే ముందురోజు అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టడం విశేషమని గాంధీ చెప్పారు. అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం కూడా ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని ఆయన విశ్లేషించారు.

## ఒబెన్ ఎలక్ట్రిక్‌కు మరో రూ.50 కోట్ల నిధులు

బెంగళూరు
ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను ఉత్పత్తి చేసే స్టార్టప్ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ మరో రూ.50 కోట్ల నిధులను సమీకరించినట్లు ప్రకటించింది. సిరీస్ ఎ రౌండ్‌లో ఈ పెట్టుబడిని అందుకున్నట్లు పేర్కొంది. ఇంతక్రితం జనవరిలో రూ.50 కోట్ల నిధులకు ఇది అదనమని పేర్కొంది. దీంతో సిరీస్ ఎ ఫండింగ్‌లో రూ.100 కోట్లు అందుకోగా.. ఇప్పటి వరకు మొత్తంగా రూ.200 నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. తాజాగా నిధులు అందించిన వాటిలో హెలియోస్ హోల్డింగ్స్, షర్దా ఫ్యామిలీ ఆఫీసు, కె ఫ్యామిలీ, ఇతర ఇన్వెస్టర్లు ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం ఈ సంస్థకు 27 నగరాల్లో 37 అవుట్‌లెట్‌లు ఉన్నాయి. 2026 మార్చి నాటికి దేశంలో 50 నగరాల్లో 150 షోరూంలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.


# స్పోర్ట్స్

## ఇంగ్లండ్‌కు సూర్యకుమార్.. స్పోర్ట్స్ హెర్నియాకు ట్రీట్‌మెంట్



న్యూఢిల్లీ
టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్..ఇంగ్లండ్‌కు పయనమయ్యాడు. అతను అక్కడ శస్త్ర చికిత్స చేయించుకోనున్నాడు. గజ్జల్లో గాయానికి అతను ట్రీట్మెంట్ తీసుకోనున్నాడు. ఒకవేళ అవసరం అయితే స్పోర్ట్స్ హెర్నియాకు శస్త్ర చికిత్స తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో.. సూర్యకుమార్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఆ టోర్నీలో అతను ముంబై ఇండియన్స్ తరపున 700 పైగా రన్స్ స్కోర్ చేశాడు. ఆ తర్వాత ఈ మధ్యే ముంబై ప్రీమియర్ లీగ్ టీ20 కూడా ఆడాడతను.అయితే ముంబై టీ20 టోర్నీ ఆడుతున్న సమయంలో.. అతని గజ్జల్లో నొప్పి మరింత తీవ్రమైనట్లు తెలుస్తోంది. వరుసగా బ్రేక్ లేకుండా క్రికెట్ ఆడడం వల్ల కూడా సమస్య అధికంగా అయినట్లు అనుమానిస్తున్నారు. స్పోర్ట్స్ హెర్నియా చికిత్స కోసం యూకేకు సూర్య వెళ్లినట్లు ఓ బీసీసీఐ అధికారి ద్వారా తెలిసింది. అయితే మళ్లీ ఆగస్టు నెల వరకు టీ20 మ్యాచ్‌లు లేకపోవడంతో.. ఈ సమయంలో ట్రీట్మెంట్ తీసుకోవాలని సూర్య భావించాడు. చికిత్స ముగిసిన తర్వాత బెంగుళూరులోని ఎక్సలెన్సీ సెంటర్‌లో కోలుకునే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు.

## లండన్‌లోని కోహ్లీ నివాసానికి వెళ్లిన శుభ్‌మన్ గిల్, పంత్



బ్ల్యూటీసీ కొత్త సైకిల్‌లో తొలి సిరీస్‌కోసం భారత జట్టు పక్కాగా సిద్ధమవుతోంది. ఇంగ్లండ్‌తో జూన్ 20న జరుగబోయే తొలి టెస్టులో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది శుభ్‌మన్ గిల్ సేన. ఇప్పటికే ఆటగాళ్లంతా ఇంగ్లండ్ చేరుకున్నారు. సిరీస్ ఆరంభానికి సమయం దగ్గరపడుతుండటంతో జట్టు ఆటగాళ్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో లండన్‌లోని భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ నివాసానికి పలువురు స్టార్ క్రికెటర్లు వెళ్లినట్లు తెలిసింది. టెస్ట్ కెప్టెన్ శుభమన్ గిల్, వైస్ కెప్టెన్ రిషభ్ పంత్, పేసర్ మహ్మద్ సిరాజ్‌తో పాటు పలువురు ఆటగాళ్లు కోహ్లీ ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. వీరికి కోహ్లీ ఫ్యామిలీ ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.భారత్, ఇంగ్లండ్‌ల మధ్య ఐదు టెస్టుల సిరీస్‌కు మరో రెండు రోజులే ఉంది. జూన్ 20న లీడ్స్‌లోని హెడింగ్లే మైదానంలో ఇరుజట్ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. డబ్ల్యూటీసీ కొత్త సైకిల్‌లో ఇరుజట్లకు ఇది మొదటి సిరీస్. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో చివరిసారిగా 2007లో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ విజేతగా నిలిచిన టీమిండియా.. ఈసారి ట్రోఫీ కొల్లగొట్టాలనే కసితో ఉంది. దాంతో, ఇరుజట్ల మధ్య హోరాహోరీ పోరు ఖాయం అనిపిస్తోంది. ఇక ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా ఇంగ్లండ్ నుంచి హుటాహుటిన స్వదేశం వచ్చిన గంభీర్ త్వరలోనే జట్టుతో కలవనున్నారు.

## సీసీఐ ముద్దంది.. నేనే వద్దన్నా..

### టెస్ట్ కెప్టెన్సీ ఆఫర్‌పై క్లారిటీ ఇచ్చిన బుమ్రా



భారత క్రికెట్ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, తనను టెస్ట్ కెప్టెన్‌గా చేయాలంటూ బీసీసీఐ నుంచి వచ్చిన ఆఫర్‌ను తిరస్కరించినట్లు సంచలన విషయాలు వెల్లడించాడు. ఇటీవల రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత, టెస్ట్ కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్‌తో పాటు బుమ్రా పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అయితే, అనూహ్యంగా గిల్ కెప్టెన్‌గా ఎంపిక కావడంపై అనేక ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో బుమ్రా స్వయంగా తన నిర్ణయాన్ని, దానికి గల కారణాలను వివరించాడు.స్కై స్పోర్ట్స్ కోసం మాజీ భారత వికెట్ కీపర్-బ్యాటర్ దినేష్ కార్తీక్‌తో జరిగిన ఇంటర్వ్యూలో బుమ్రా మాట్లాడుతూ, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్లు ప్రకటించడానికి ముందే తాను తన పనిభారం (వర్క్‌లోడ్) గురించి బీసీసీఐ అధికారులతో, సెలెక్టర్లతో చర్చించినట్లు తెలిపాడు. తన వెన్నునొప్పి సమస్యలను పర్యవేక్షిస్తున్న వైద్యులు, ఫిజియోలతో మాట్లాడిన తర్వాత, భవిష్యత్తులో తన శరీరంపై అదనపు భారం పడకుండా చూసుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పుకొచ్చాడు."ఐదు టెస్టుల సిరీస్‌లో నా పనిభారం ఎలా ఉండాలి అనే దానిపై నేను బీసీసీఐతో మాట్లాడాను. నా వెన్నును పర్యవేక్షించే మెడికల్ టీం, నాకు శస్త్రచికిత్స చేసిన సర్జన్‌తో కూడా చర్చించాను. పనిభారం విషయంలో తెలివిగా వ్యవహరించాలని వారు నాకు సూచించారు. ఈ చర్చల అనంతరం, నేను కొంచెం జాగ్రత్తగా ఉండాలనే నిర్ణయానికి వచ్చాను" అని బుమ్రా వివరించాడు.అంతేకాకుండా, ఐదు టెస్టుల సిరీస్‌లో తాను అన్ని మ్యాచ్‌లూ ఆడలేకపోవచ్చని, అలాంటప్పుడు కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించడం జట్టుకు న్యాయం కాదని బుమ్రా స్పష్టం చేశాడు. "బీసీసీఐ నన్ను నాయకత్వ పాత్ర కోసం పరిశీలించింది నిజమే. కానీ, నేను అందుకు 'నో' చెప్పాల్సి వచ్చింది. ఒక సిరీస్‌లో మూడు మ్యాచ్‌లకు ఒకరు, మిగతా మ్యాచ్‌లకు మరొకరు కెప్టెన్‌గా ఉండటం జట్టుకు మంచిది కాదు. నేను ఎప్పుడూ జట్టు ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తాను" అని బుమ్రా అన్నాడు. కెప్టెన్సీ తనకు ఎంతో ముఖ్యమని, దాని కోసం తాను చాలా కష్టపడ్డానని, అయితే కెప్టెన్సీ కంటే క్రికెట్ అంటేనే తనకు ఎక్కువ ఇష్టమని, ఒక ఆటగాడిగా జట్టుకు మరింత సహకరించాలనుకుంటున్నానని చెప్పుకొచ్చాడు.




# ‘హరిహర వీరమల్లు’కి పోటీగా వస్తున్న విజయ్ ‘కింగ్‌డమ్’.!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం కింగ్‌డమ్. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నాడు. గత నెల మే 30న విడుదల కావాల్సి ఉన్న ఈ చిత్రం పలు కారణాల వలన వాయిదా పడుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ టైం పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు వస్తుదంటూ పోస్ట్ పోన్ చేసుకున్నారు మేకర్స్ కానీ.. ఈ తేదీకి వీరమల్లు కూడా రాకపోవడంతో తేదీ వృధాగా పోయింది. ఆ తర్వాత ఇండియా పాకిస్థాన్ మధ్య పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో ఈ సినిమాను జూలై 04న తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. అయితే ఈ తేదీ కూడా క్యాన్సిల్ అవ్వడంతో తాజాగా మరో డేట్ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఈ సినిమాను జూలై 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే కింగ్‌డమ్ వచ్చే కంటే ఒకరోజే ముందే వీరమల్లు రాబోతుంది. హరిహర వీరమల్లుని జూలై 24న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే రెండు సినిమాలకు గట్టి పోటీ ఉండబోతుందని సమాచారం.కింగ్‌డమ్ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నది. సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. అనిరుధ్ రవిచంద్ర మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్‌ను హైదరాబాద్, విశాఖపట్నం, కేరళ, శ్రీలంకలో చిత్రీకరించినట్లు సమాచారం.

# అమ్మడి జోరు ఆగేలా లేదుగా..

ఈ ఏడాది ప్రారంభంలోనే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సూపర్ హిట్ అందుకుంది మీనాక్షి చౌదరి. గతేడాది సైతం లక్కీ భాస్కర్ సినిమాతో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. నటనకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ.ఇక ఇప్పుడు ఈ అమ్మడు తన సినిమాల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆమె చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద హిట్టవ్వడం ఖాయమని టాక్. ఇక ఇప్పుడు తెలుగుతోపాటు తమిళంలోనూ ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్స్ వస్తున్నాయి. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది.తాజాగా ఈ అమ్మడు నెట్టింట గ్లామర్ ఫోటోష్ షేర్ చేస్తూ అభిమానులకు షాకిస్తుంది. ఇటీవల వైట్ డ్రెస్ లో గ్లామర్ లుక్స్ తో నెట్టింట అరాచకం సృష్టించిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు ఆకుపచ్చ చీరకట్టులో మెస్మరైజ్ చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన అందమైన ఫోటోస్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.ఇదిలా ఉంటే ప్రస్తుతం నాగచైతన్యకు జోడిగా ఓ సినిమాలో నటిస్తుంది మీనాక్షి. భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అలాగే నవీన్ పొలిశెట్టి సరసన అనగనగ ఒక రాజు చిత్రంలోనూ ఈ అమ్మడు నటిస్తుంది. ఈ మూవీ ఈ ఏడాదిలో అడియన్స్ ముందుకు రానున్నట్లు సమాచారం.ఇవే కాకుండా తెలుగులో మరో రెండు సినిమాలకు కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలో రెండు సినిమాలు.. వచ్చే సంవత్సరంలో మరిన్ని సినిమాలు విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ రెండేళ్లు వరుసగా హిట్స్ అందుకోవాలని చూస్తోంది మీనాక్షి. అటు తమిళంలోనూ ఆఫర్స్ వస్తున్నట్లు సమాచారం.



# పూరి సినిమాలో సంయుక్త మీనన్

లైగర్, డబుల్ ఇస్మార్ట్ చిత్రాల అనుభవాలను పాఠాలుగా చేసుకొని, తన కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి ఓ భిన్నమైన కథ రాసుకున్నారు అగ్ర దర్శకుడు పూరీ జగన్నాథ్. కథతోపాటు పాత్రల ఎంపిక విషయంలో కూడా ఆయన విభిన్నంగా వెళ్తున్నారు. ఇప్పటికే కథానాయకుడిగా తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతిని తీసుకున్నారు. సీనియర్ నటి టబుని ఓ కీలక పాత్రకు ఎంపిక చేశారు. రీసెంట్‌గా ఈ ప్రస్టేజియస్ ప్రాజెక్ట్‌లోకి లక్కీ హీరోయిన్ సంయుక్త మీనన్ వచ్చి చేరింది.ఈ విషయాన్ని తెలియజేస్తూ.. చిత్ర బృందం ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ పెట్టింది. ‘అమె నడకలో హుందాతనం.. కళ్లల్లో ఆగ్రహం..’ అంటూ సంయుక్తకు స్వాగతం పలుకుతూ ఆమెతో కలిసి పూరీ, ఛార్మీ దిగిన ఫొటోను ఈ పోస్ట్‌లో పంచుకున్నారు. బాలీవుడ్ నటి రాధిక ఆప్టేని ఈ సినిమాలో ఎంపిక చేసినట్టు గతంలో వార్తలొచ్చాయి. ఇప్పుడు ఆమె స్థానంలోనే సంయుక్త మీనన్‌ని తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ చిత్రానికి ‘బెగ్గర్’ అనే టైటిల్ ముందు అనుకున్నారు. తాజాగా ‘భిక్షాందేహి’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు.




# సెన్సార్ కంప్లీట్.. 3 గంటల రన్‌టైంతో ‘కుబేర’

టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘కుబేరా’. ఈ ప్రాజెక్ట్‌లో తమిళ స్టార్ ధనుష్, టాలీవుడ్ మన్మథుడు నాగార్జున, క్రేజీ బ్యూటీ రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.శ్రీ వెంకటేశ్వర సినిమాస్ LLP , అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూన్ 20, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది. అయితే తాజాగా ఈ చిత్రం సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికేట్‌ను అందజేసింది. అలాగే 181 నిమిషాల భారీ రన్‌టైంతో ఈ సినిమా విడుదల కాబోతుంది. మరోవైపు ఈ చిత్రానికి 19 కట్స్ చెప్పినట్లు సమాచారం.




# డ్రిల్ మాస్టర్ శివశంకర్‌గా చిరంజీవి..

## కామెడీకి పొట్ట చెక్కలవ్వాల్సిందే..!




కొద్ది రోజుల క్రితం విశ్వంభర ప్రాజెక్ట్ పూర్తి చేసిన చిరంజీవి ఇప్పుడు తన 157వ సినిమాగా అనీల్ రావిపూడితో క్రేజీ ప్రాజెక్ట్ చేస్తున్నాడు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాని 2026 సంక్రాంతి టార్గెట్ కి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు అనీల్ రావిపూడి 8 సినిమాలు చేయగా, ఇందులో ఒక్క ఫ్లాప్ లేదు. ఆడియన్స్ పల్స్ పట్టి వారికి తగ్గట్టుగానే సినిమాలు తీసి హిట్స్ అందుకుంటున్నాడు. స్టార్స్ నుంచి ఫ్యాన్స్ ఆశించే అంశాలు ఇస్తూనే తన మార్క్ ఎంటర్టైన్మెంట్ అందిస్తున్నాడు అనిల్ రావిపూడి. ప్రస్తుతం చిరు- అనీల్ ప్రాజెక్ట్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ గా తెరకెక్కుతుంది. మూవీ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.చిరంజీవి అసలు పేరు శివ శంకర్ వరప్రసాద్ కాగా, అదే పేరుతో ఈ సినిమాలో కనిపించనున్నారు. డ్రిల్ మాస్టర్ శివ శంకర్ వరప్రసాద్ గా తన కామెడీతో రచ్చ చేయనున్నారట చిరు. స్కూల్ నేపథ్యంలో వచ్చే కామెడీ సీన్స్ అదిరిపోతాయని, చిరు కామెడీకి థియేటర్లలో పొట్ట చెక్కలయ్యేలా నవ్వడం ఖాయమని అంటున్నారు. ‘సంక్రాంతికి వస్తున్నాం’లో బుల్లిరాజుగా మాస్టర్ రేవంత్‌తో హాస్యాన్ని పంచిన అనీల్ రావిపూడి ఇప్పుడు మెగా 157లో చిరంజీవితో తెగ కామెడీ పండించనున్నాడట. చిరుకి జతగా ఇందులో బుల్లిరాజు కూడా ఉంటాడట. చిరు-రేవంత్ మధ్య వచ్చే కామెడీ సీన్స్ ఓ రేంజ్ లో ఉంటాయని అంటున్నారు. చిరు డ్యాన్స్ చేస్తే ఫ్యాన్స్ కి పూనకాలే.. ఇక ఫైట్స్ అయితే నెక్స్ట్ లెవెల్ అని చెప్పాలి. వాటితో పాటు చిరంజీవిలోని కామెడీ యాంగిల్ కూడా అదిరిపోతుంది. ఆయన టైమింగ్ ని పట్టుకోవాలే కానీ మామూలుగా ఉండదు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492